



# స్వామియే శరణం అయ్యప్ప

- అయ్యప్ప మాలధారణ.. ఆధ్యాత్మికం, ఆరోగ్యదాయకం
- ప్రారంభమైన అయ్యప్ప మండల దీక్షలు
- ప్రత్యేక పూజలతో సందడిగా మారనున్న మణికంఠుని కోవెలలు
- మార్మోగనున్న స్వామి నామస్మరణ

**అకుంఠిత దీక్ష,** అంతులేని ఆత్మవిశ్వాసంతో సన్నిధానానికి చేరుకొని స్వామిని దర్శించడమే అయ్యప్ప దీక్షలోని ఆంతర్యం. ఈ దీక్ష అద్వితీయమైన నియమాలతో రూపొందించింది. అయ్యప్ప దీక్షను పాటించే సమయమిదే. 41 రోజుల పాటు కఠోర నియమాలు పాటిస్తూ, నిష్టగా పూజాది కార్యక్రమాలు ఆచరించే భక్తులకు పవిత్రమైన రోజులివి. తనువు, మనస్సును చెడు నుంచి మంచి మార్గం వైపు మళ్లించే ఈ దీక్షను స్వీకరించిన భక్తులు స్వామియే శరణం అంటూ అయ్యప్ప సేవలో తరిస్తుంటారు. ఈ దీక్ష కఠోర నియమాలతో కూడుకున్నప్పటికీ, దీక్ష వల్ల వచ్చే మానసిక ఆనందం, ఆత్మ పరిశీలన శక్తి, అపూర్వమైన ఆధ్యాత్మిక ఆనందం దీక్షాపరులకు అనుభవంలోకి వస్తాయి. శివునికి ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో కఠిన నియమ, నిష్టలతో అయ్యప్ప దీక్షలు చేపట్టడం జన్మజన్మల పుణ్యఫలంగా భావిస్తారు. ఆధ్యాత్మిక చింతన, ఆరోగ్య నియమాల కలబోత అయిన అయ్యప్ప దీక్ష విశేషాలపై ప్రత్యేక కథనం...

**- బాలానగర్, డిసెంబర్ 1**



బాలానగర్‌లో మాలధారణ చేస్తున్న సతీశ్‌నాయర్‌గురుస్వామి (ఫైల్)

## అయ్యప్ప దీక్షా నియమాలు..

- అయ్యప్పదీక్ష తీసుకున్న భక్తులు నల్లని దుస్తులు ధరించాలి.
- 41రోజుల పాటు (మండలం రోజు) నియమ నిష్టలు పాటించాలి.
- దీక్షా సమయంలో తల, గడ్డం, వెంట్రుకలు, గోళ్లను తీయడం నిషేధం.
- చెప్పులు ధరించొద్దు.
- తెల్లవారుజామున అమృత ఘడియల్లో (సూర్యోదయానికి ముందు) చల్లని నీటితో స్నానం ఆచరించాలి. సాయంత్రం కూడా చల్లని నీటితో స్నానం ఆచరించాలి.
- నుదుట విబూది, గంధం, కుంకుమ మధ్యలో బొట్టు పెట్టుకోవాలి
- ఒక్కపూట భోజనం (మధ్యాహ్నం భిక్ష) రాత్రి పండ్లు, ఫలహారం అల్పాహారంగా తీసుకోవాలి.
- కటిక నేలపై నిద్రించాలి.
- అశుభ కార్యాలు జరిగే ప్రదేశాలకు, దుఖ: సంబంధమైన ఘటనల్లో పరామర్శకు వెళ్లరాదు.
- పగలు నిద్రించకూడదు. శవాన్ని చూడకూడదు. మనస్సును అదుపులో ఉంచుకొని శరణుఘోష చెప్పుకోవాలి.
- పూజ చేసుకున్న తర్వాత ఉదయం, సాయంత్రం వృత్తి రీత్యా పనులు చేసుకోవచ్చు.
- తన శక్తికొలది ఒక్కసారైనా ఐదుగురు అయ్యప్పలకు భిక్ష పెట్టాలి.
- హింసాత్మక చర్యలు, దుర్భాషలాడడం, అబద్ధాలాడడం చేయరాదు.
- దీక్షా సమయంలో హోదా, వయస్సు, పేద, ధనిక తేడా లేకుండా అయ్యప్పలందరికీ పాదాభివందనం చేయాలి.



## ఇరుముడి ప్రత్యేకత..

అయ్యప్ప దీక్షలో ఇరుముడికి ప్రత్యేకత ఉన్నది. దీక్ష తీసుకున్న స్వాములు శబరిమలై ప్రయాణంలో మొదటి ఘట్టం ఇరుముడి, ఇరుముడి ధరించే అయ్యప్పస్వామి తెల్లవారుజామున ఇంటి గుమ్మం వద్ద కొబ్బరికాయ కొట్టి ఎవరితోనూ మాట్లాడకుండా ఆలయానికి వెళ్లి గురుస్వామితో ఇరుముడి కట్టించుకోవాలి. ఇరుముడితో శబరిమలై వెళ్లిన వారికి 18 మెట్లు ఎక్కే అర్హత లభిస్తుంది.

## మాల విరమణ..

అయ్యప్ప స్వామి దీక్ష పూర్తి చేసుకున్నాక శబరియాత్రకు వెళ్లిన అయ్యప్పస్వాములు అక్కడే దీక్ష విరమిస్తున్నారు. ఇంకొందరు తిరుపతిలో మొక్కులు తీర్చుకుని అక్కడ కూడా విరమిస్తున్నారు. అలా కాకుండా శబరి యాత్ర పూర్తయ్యాక దీక్ష పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వచ్చి మాతృమూర్తి ద్వారా మాల విరమించుకోవాలని గురుస్వాములు సూచిస్తున్నారు.



## పడిపూజ ఎందుకు..?

అయ్యప్ప సన్నిధానంలో 18 మెట్లు ఉంటాయి. ఇవి కామం, క్రోధం, లోభ, మోహ, మద, మత్సర్యాలైయిన అరిషడ్వర్గాలని ప్రతీతి. మనిషిలోని 18 రకాల చెడు గుణాలు తొలగిపోవడానికి దీక్షలో పడిపూజ (మెట్టు పూజ) నిర్వహిస్తారు. అయ్యప్ప మాల ధరించిన ప్రతిసారి చెడు లక్షణాలను విడిచిపెట్టి మంచి వారిగా మారాలని కోరుకుంటూ ఈ పూజను నిర్వహిస్తారని గురుస్వాములు చెబుతారు.

## కన్నెస్వాములు ఎంతో ప్రత్యేకం..

శబరి కొండల్లో ఉండే మాలికాపురోత్తమ అయ్యప్పస్వామిని ప్రేమిస్తుంది. తనను వివాహం చేసుకోవాల్సిందిగా కోరుతుంది. ఇది విన్న స్వామివారు చిరునవ్వుతో తిరస్కరిస్తాడు. అయినా ఆమె పట్టువీడదు. దీంతో కన్నెస్వాములు తన మాల ధరించి రానప్పుడు వివాహమాడుతానని స్వామి ఆమెకు మాట ఇచ్చాడు. నూతన మాలధారులైన కన్నెస్వాములు రాకుండా ఉండడం ఎప్పటికీ జరగదని దీనిలో పరమార్థం. ఇందులో భాగంగానే ఏటేటా కన్నెస్వాముల సంఖ్య పెరుగుతూనే వస్తుంది. తొలిసారి మాలవేసే కన్నెసాములతోపాటు వరుసగా కత్తిస్వామి, గంట స్వామి, గధస్వామి, గురుస్వాములుగా పిలుస్తారు. 9నుంచి 18సార్లు శబరిమల యాత్రకు వెళ్లి వచ్చినవారు కన్నెస్వాములు దీక్షలు చేపట్టేందుకు సహకరిస్తారు.



## అయ్యప్ప అవతారం..



పూర్వకాలంలో మహిషి అనే రాక్షసి బోళా శంకరుడి వరం పొంది ప్రజలను ఇంద్రాది దేవతలను సైతం హింసించేది. తనకు ఆడ,మగ కలయికతో పుట్టిన వారితో గానీ, విల్లుతో గానీ, ఆయుధాలతో గానీ మరణం ఉండకుండా వరం పొందింది. ఆ తర్వాత ఇంద్రాది లోకాలకు వెళ్లి వికృత చేష్టలకు దిగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. మహిషి చేష్టలకు భయాందోళన చెందిన దేవతలు మహా విష్ణువును శరణు కోరతారు. దీంతో ఆయన మోహినీ అవతారమెత్తి పరమ శివుడిని మోహిస్తాడు. వీరద్దరి కలయికతో అయ్యప్ప జన్మిస్తాడు. మణిమాలతో కేరళ రాజ్యంలోని అటవీ ప్రాంతంలో పాండ్యరాజులకు దొరుకుతాడు. మణిమాలతో దొరికిన ఆ శిశువుకు మణికంఠుడు అని నామకరణం చేస్తారు. మణికంఠుడు మహిషిని వధించి దేవతలు, మునుల పూజ లందుకుంటాడు. అనేక మహిమలతో పాండ్య రాజులకు, ప్రజలకు దగ్గరవుతాడు.

## మాలధారులు ఎన్ని రకాలు..?

అయ్యప్ప మాలను కొత్తగా ఈ సంవత్సరమే ధరించినవారు ఉంటారు. ఏండ్ల తరబడిగా దీక్ష స్వీకరిస్తున్నవారూ ఉంటారు. అయితే ఎవరిని ఎలా పిలుస్తారో చాలా మందికి తెలియదు. మొదటి సారి మాలధరిస్తే 'కన్నె స్వామి' అంటారు. రెండోసారి ధరించిన భక్తులను 'కత్తి స్వామి'గా పిలుస్తారు. మూడోసారి అయితే 'గంట స్వామి', నాలుగోసారి 'గధ స్వామి', ఐదోసారి 'పేరు స్వామి', ఆరోసారి ధరించినవారిని 'త్రిశూల్ స్వామి' అని వ్యవహరిస్తారు. ఏడు, అంతకన్నా ఎక్కువసార్లు ధరిస్తే 'గురు స్వామి'గా పరిగణిస్తారు. 18, అంతకన్నా ఎక్కువ సార్లు మాల ధరించినవారిని 'నారీకేళ స్వామి' అని సంబోధిస్తారు.





## ఇరుముడి అత్యంత ప్రాధాన్యం..

అయ్యప్పస్వామిని నవ విధ సేవలతో పూజిస్తుంటారు. నవ విధాలుగా అనగా శ్రావణం, కీర్తనం, స్మరణం, పాదాసేవనం, అర్చనం, నమస్కారం, ధాన్యం, స్కృతం, ఆత్మ నివేదనంతో 41రోజులు దీక్ష పూర్తి చేసిన తర్వాత ఇరుముడికి అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఇరుముడి అంటే రెండు అని అర్థం. అనగా రెండు ముడులు అని. ముందు ముడి (మూట)లో పీఠం, భస్మం, గంధం, కొబ్బరికాయలు, నెయ్యి, పూజా సామగ్రి ఉంటాయి. వెనుకముడి (రెండో మూట)లో ప్రయాణానికి కావాల్సిన వస్తువులుంటాయి. వీటినే పుణ్యపు మూట, పాపపు మూట అని పిలుస్తారు.

### స్వామివారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం..



కార్తీకమాసంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్పమాల ధరించి 41 రోజులపాటు కఠోరదీక్ష చేసి ఇరుముడి కట్టుకొని శబరిమలకు చేరుకుంటా. ఇరుముడితో 18మెట్లు ఎక్కి స్వామివారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం. గురుస్వామి సమక్షంలో మొదటిసారి మాలధరణ చేశాను. అయ్యప్ప దీక్ష తీసుకోవడంతో నేను అనే భావన నశించి భక్తిభవం పెరుగుతుంది.

**- శ్యాంసుందర్‌రెడ్డి, కన్నెస్వామి, వనమోనిగూడ, బాలానగర్ మండలం**

### నిష్టతో అయ్యప్ప దీక్ష తీసుకోవాలి..



కార్తీక మార్గశిర మాసాల్లో గురుస్వాముల ద్వారా మాల ధరించి దీక్ష తీసుకొని 41రోజులపాటు పాటించాలి. మాలధరణ చేసిన స్వాములు ఒంటిపూట మాత్రమే బిక్ష తీసుకోవాలి. కులమతబేధ తారతమ్యాలు లేని ఆధ్యాత్మిక ప్రపంచమే అయ్యప్ప మాలధారణకు ఉన్న విశేషం.

**- శ్రీనివాసులు, గురుస్వామి, బాలానగర్**

# ఈవీఎంలలో 'నేతల రాత'

- ఉమ్మడి జిల్లాలో టెన్షన్.. టెన్షన్
- రేపు అభ్యర్థుల భవితవ్యం వెల్లడి
- అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ముమ్మరంగా ఏర్పాట్లు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..
- కౌంటింగ్‌పైనే అందరి దృష్టి
- బీఆర్ఎస్ పార్టీకి అత్యధిక స్థానాలు వచ్చే అవకాశం
- ఓడిపోతానన్న భయంతో ఏడ్చేసిన ఓ కాంగ్రెస్ నేత
- ఓటేసిన 21,27,056 మంది..

మహబూబ్‌నగర్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు రాజకీయపక్షాలకు పరీక్షగా మారాయి. ఓటర్ల నాడి తెలియక అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఒక కాంగ్రెస్ క్యాండిడేట్ ఓడిపోతానని భయంతో ఏడ్చేసినట్లు ప్రచారం అవుతున్నది. అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన అభ్యర్థులు ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడుతారని బెట్టింగ్‌లు మొదలయ్యాయి. అభ్యర్థులంతా టెన్షన్‌లో ఉన్నారు. ఎవరు కూడా గెలుపు ధీమాను వ్యక్తం చేయకపోవడం గమనార్హం. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈసారి కూడా బీఆర్ఎస్ పార్టీ సత్తా చూపెట్టబోతుందని విశ్లేషకులు అంటున్నారు. అన్ని పార్టీల అభ్యర్థులు పోలింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించే పనిలో పడ్డారు. ఎవరికి వారే లెక్కలు వేసుకుంటున్నారు. ఈసారి బీజేపీ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. అన్ని నియోజకవర్గాల్లో ఓడిపోతామని భయంతో ఆ పార్టీ నేతలు కాంగ్రెస్‌తో విలాఖత్ కావడం సంచలనం కలిగిస్తుంది. కేంద్రంలో అధికారం కోసం అర్రులు చేస్తున్న బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం చేయి, చేయి కలపడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. చాలాచోట్ల విపక్షాలు మైండ్ గేమ్ ప్లే చేసి ఓటర్లను తికమక చేసే ప్రయత్నం చేసినప్పటికీ గులాబీ గుబాలింపు తప్పదని అంటున్నారు. పోలింగ్ ప్రక్రియ తర్వాత నిర్వహించిన ఎగ్జిట్ పోల్‌లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని తేలిపోయింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కనీసం 10 స్థానాలు దక్కించుకుంటుందని, మిగతా రెండు స్థానాల్లో హోరాహోరీ పోరు నెలకొందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. రాష్ట్రంలో కూడా మూడోసారి కేసీఆర్ నాయకత్వంలో హ్యాట్రిక్ కొడతామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. కాగా, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో భారీ పోలింగ్ నమోదైంది. అత్యధికంగా గద్వాల జిల్లాలో 82.42శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా, మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 77.72శాతం తక్కువగా పోలింగ్ నమోదైంది. ఉమ్మడి జిల్లాలో 28,89,871 మంది ఓటర్లకు గానూ 21,27, 056 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈవీఎంలను అధికారులు స్ట్రాంగ్ రూంలకు తరలించి భద్రపరిచారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 173 మంది అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూముల్లో నిక్షిప్తమైంది. ఈనెల 3వ తేదీన కౌంటింగ్‌కు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల వారీగా నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియను చేపట్టబోతున్నారు. ఇదిలా ఉండగా, ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓసేందుకు అభ్యర్థులు పోటెత్తారు. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడం, మరికొన్ని చోట్ల సాయంత్రం భారీగా క్యూలైన్లు ఉండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకు పోలింగ్ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం వరకు కూడా ఆయా నివేదిక వర్గాల పోలింగ్ ప్రక్రియ నిర్వహణలోని అధికారులు తలమునకలయ్యారు. ఈసారి ఎన్నికల కమిషన్ అనేక నిబంధనలు విధించడంతో వాటిని లెక్క చూసుకొని నిక్షిప్తం చేసే పనిలో పడ్డారు. మరోవైపు పోలింగ్ సిబ్బంది తీసుకువచ్చిన ఈవీఎంలను ఆయా జిల్లా కేంద్రాల్లోని కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. ఆదివారం కౌంటింగ్ చేయనుండడంతో ఆయా జిల్లా కేంద్రాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ర్యాలీలు ఇతర వాటికి అనుమతిని నిషేదించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 200 మీటర్ల దూరంలోనే అందరినీ నిలిపివేసేలా చర్యలు తీసుకుంటున్నారు. కౌటింగ్ కేంద్రం వద్ద అనుమతి ఉన్నవారికి లోపలికి పంపిస్తారు. ఫలితాలను ఎప్పటికప్పుడు అందించేందుకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నది.

**పోలింగ్ ప్రక్రియ ఆలస్యం..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ రాత్రి 10గంటల వరకు కొనసాగింది. ఒక్కో నియోజకవర్గంలో కొన్నిచోట్ల ఈవీఎంలు మురాయించడం వల్ల సాయంత్రం ఐదు గంటల దాటిన తర్వాత ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. వనపర్తి నియోజకవర్గంలోని పెద్దమందడి మండలం అమ్మపల్లిలో వనపర్తి మండలం చిట్యాల, నాగర్‌కర్నూల్ పట్టణంలోని 119 పోలింగ్ కేంద్రంలో అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల, వంగూరు మండలంలోని ఒక్కొక్క పోలింగ్ కేంద్రాల్లో జడ్చర్ల నియోజకవర్గంలోని ఊర్కొండ మండలం బొమ్మరాశిపల్లి, జరగబోయినపల్లి, జడ్చర్ల మండలం కోడ్గల్, జడ్చర్ల పట్టణం మిడ్జిల్ మండలంలోని బోయినపల్లి, నవాబ్‌పేట మండలంలోని ఎన్మనగండ్లచ లోకిరేవు, రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ, ఈద్గానపల్లి, అలంపూర్ నియోజకవర్గంలోని మానవపాడు మండలం చిన్నపొలికేపాడు, ఇటిక్యాల మండలం షాబాద్, మక్తల్ నియోజకవర్గంలోని మాగనూరు మండలం, ఊట్కూరు మండలం పెద్దాపూర్, ఆత్మకూరు పట్టణం, గద్వాల నియోజకవర్గంలోని గద్వాల టౌన్, ధరూర్ మండలంలోని మద్దెలబీడు, గొర్లఖాన్‌దొడ్డి, కేటీదొడ్డి మండలంలోని గగన్‌పల్లి, మల్దకల్, ఎలుకూరు, దేవరకద్ర నియోజకవర్గంలోని అడ్డాకుల మండలం రాచాల, కందూరు, కొత్తకోట మండలం కనిమెట్ట, భూత్పూర్ మండలం సిద్దాయపల్లి, మదనాపూర్ మండలం దుప్పల్లి, అజ్జకొల్లు, మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలం పెద్దదర్పల్లి, రేపూరు, బుద్దారం, టంకర రూరల్ మండలంలోని జమిస్తాపూర్, అర్బన్ మండలంలోని ఎదిర, కల్వకుర్తి నియోజకవర్గం కేంద్రంతోపాటు ఆమనగల్ మండలంలోని జంగారెడ్డిపల్లి, రామునింతల, కొల్లాపూర్ నియోజకవర్గంలో యన్మన్‌బెట్ల, సింగపట్నం, పెంట్లవెల్లి, నారాయణపేట పట్టణంలో పోలింగ్‌బూత్ నంబర్ 151,161లో పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. 5గంటలలోపే క్యూలైన్‌లో నిల్చుండడంతో వారందరికీ ఓటు వేసేందుకు అనుమతించారు. కాగా, చాలాచోట్ల ఒక్కో ఓటరుకు ఓటు వేసేందుకు రెండు నుంచి మూడు నిమిషాల టైం పట్టింది. దీంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. ఓటర్లు ఓటు వేసిన ఈవీఎం, వీవీ ప్యాట్‌లను సీజ్ చేసి జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని పాత ఇంజనీరింగ్ కళాశాలలో మక్తల్, నారాయణపేట నియోజకవర్గ ఓట్లలెక్కింపు చేపట్టనున్నారు. అలాగే గద్వాల జిల్లా కేంద్రంలో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల కౌంటింగ్, వనపర్తి జిల్లా కేంద్రంలో వనపర్తి నియోజకవర్గం, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. కల్వకుర్తి నియోజకవర్గం కౌంటింగ్ రంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తారు. ఆయా కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు.

**ఓటేసిన 21లక్షల మంది..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఓటర్లు భారీగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 28,89,871 మంది ఓటర్లలో 21,27, 056 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 1,78,069, దేవరకద్రలో 1,94,543, జడ్చర్లలో 1,79,600, గద్వాలలో 2,13,283, అలంపూర్‌లో 1,96,307, అచ్చంపేటలో 1,94, 077, కొల్లాపూర్‌లో 1,87,087, నాగర్‌కర్నూల్‌లో 1,83,098, నారాయణపేటలో 1, 81,780, మక్తల్ నియోజకవర్గంలో 1,86,860, వనపర్తిలో 2,10,739, కల్వకుర్తిలో 2,01 285 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గద్వాలలో 82.42 శాతం అత్యధిక పోలింగ్ కాగా, మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో అత్యల్పంగా 77 .72శాతం పోలింగ్ నమోదైంది.

**ఫలితాలపై ఉత్కంఠ..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. అన్ని నియోజకవర్గాల్లో ఓటర్లు చాకచక్యంగా వ్యవహరించి ఓటు వేశారు. ఎన్నికల ఫలితాలు వస్తే తప్పా ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడుతారనే విషయం తేలడంలేదు. దీంతో అభ్యర్థుల్లో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. 2018 ఎన్నికల్లో కూడా ఇదే రకమైన ఉత్కంఠ నెలకొన్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేసింది. ఓటింగ్ సరళి ప్రక్రియను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌దే పైచేయిగా కనిపిస్తున్నది. చివరి నిమిషంలో కాంగ్రెస్, బీజేపీ ఏకం కావడం రాజకీయ వర్గాలను విస్మయ పరిచింది. ఏదేమైనా ఓటరు మహాశయులు ఎవరికి పట్టం కడతారోనన్నది ఆదివారం తేలనున్నది.



నాగర్‌కర్నూల్‌లో స్ట్రాంగ్ రూమ్‌కు వద్ద భద్రతగా ఉన్న పోలీస్ సిబ్బంది

# అంతటా ఉత్కంఠ

వనపర్తి, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ దగ్గరికి వస్తున్న క్రమంలో ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ పెరుగుతున్నది. ఇక ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియను ముగించుకున్న తరుణంలో కౌంటింగ్ కార్యాచరణపై కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్ని చర్యలను తీసుకుంటున్నారు. వనపర్తి అసెంబ్లీ స్థానానికి 13మంది అభ్యర్థులు పోటీ చేయగా, 2,71 ,151 ఓటర్లుంటే, వీరిలో 2,10,739 మంది ఓటు వేశారు. పురుషులు లక్షా 6,606 ఓట్లు వేయగా, మహిళలు లక్షా 4,132 మంది, ఇతరులు ఒక్క ఓటు వేయడం జరిగింది. మొత్తం 77.72 శాతంగా పోలింగ్ నమోదైంది. వనపర్తి అసెంబ్లీ ఎన్నికల్లో 13మంది ఎమ్మెల్యే పదవికి పోటీలో నిలిచారు. వీరికి నియోజకవర్గంలోని ఏడు మండలాలు, రెండు మున్సిపాలిటీల వారీగా 1,71,947 మంది ఓట్లేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, అనుజ్ఞారెడ్డి ప్రధాన పార్టీల నుంచి పోటీ చేశారు. వీరితోపాటు బీఎస్పీ నుంచి మండ్ల మైబూస్, ధర్మసమాజ్ పార్టీ నుంచి బంకల ఎల్లయ్య, ప్రజా ఏక్తా పార్టీ నుంచి సూర్యప్రకాశ్, ఏవోడీఆర్ పార్టీ నుంచి అర్జున్ పోటీ చేయగా, మరో ఆరుగురు అభ్యర్థులు స్వతంత్రులుగా ఎన్నికల బరిలో నిలిచారు. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులే ప్రచారాలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు.ఎగ్జిట్ పోల్ సర్వేలు ఎలా ఉన్నా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులే తమను గెలిపించుకుంటాయన్న ధీమాలో బీఆర్ఎస్ ఉంది.

**స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు..**

పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో కేటాయించిన స్ట్రాంగ్ రూంలకు తరలించారు. ప్రత్యేక పోలీసుల పహారాలో స్ట్రాంగ్ రూంలకు భద్రతను కల్పిస్తున్నారు. ఈవీఎం గదులకు సీల్ వేసిన అధికారులు ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఆదివారం కౌంటింగ్ ప్రక్రియ ఉన్నందునా అందుకు సంబంధించిన చర్యలపైనా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఎవరి ధీమా వారిదే..

గద్వాల, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికలు గురువారం ముగియడంతో గెలుపు, ఓటములపై ఉత్కంఠ నెలకొంది. ఫలితాల కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సర్వేలన్నీ బీఆర్ఎస్ ముచ్చటగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అంచనా వేశాయి. దీంతో జోగుళాంబ గద్వాల జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు జోష్‌గా ఉన్నాయి. గద్వాల నియోజకవర్గంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఐదేండ్ల కాలంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి తనకు అనుకూలంగా మారడంతో ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపారని బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ధీమాగా ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సరిత మాత్రం నేను బహుజన బిడ్డనంటూ, అవకాశం కల్పించాలని కోరుతూ ప్రచారం చేసింది. కాగా, నియోజకవర్గానికి సరిత చేసిందేమీ లేకపోవడంతో ఒకింత బీఆర్ఎస్‌కే ప్రజలు మొగ్గు చూపారని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో సీఎం కేసీఆర్ చేపట్టిన సభలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయి. అదే ఊపు బీఆర్ఎస్‌లో చివరి వరకు కొనసాగింది. అదే కాంగ్రెస్ నాయకులు ఓటర్లను ఆకట్టుకోవడానికి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ సభలు నిర్వహించిన ఫలితం అంతంత మాత్రమే కనిపిస్తుంది. బీజేపీ నాయకులు కేంద్ర హోంశాఖ మంత్రి అమీత్‌షా సభ ఏర్పాటు చేసినా ప్రజల నుంచి స్పందన రాలేదు. జిల్లాలో గెలుపు, ఓటములపై ఇరు పార్టీలు ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. అయితే కారు స్పీడ్‌ను హస్తం అందుకుంటుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో జిల్లాలో 5,94,543 మంది ఓటర్లు ఉండగా, గద్వాలలో 82.42శాతం పోలింగ్ నమోదైంది. అలంపూర్ నియోజకవర్గంలో 79.8శాతం పోలింగ్ నమోదైంది. ఆదివారం గెలుపు ఓటముల ఉత్కంఠకు తెరపడనున్నది.